క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వై.రామవరం/అడ్డతీగల: వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మూడు మండలాల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ దివాకర రావు, వై.రామవరం ఏఈ దొర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైవే రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పులు, లైన్‌ల మరమ్మతు పనులు తదితర కారణాల వల్ల వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అరకులోయ ఎంపీడీవోగా లవరాజు



అరకులోయ రూరల్: అరకులోయ నూతన ఎంపీడీవోగా లోవరాజు గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆనందపురం మండలం ఎంపీడీగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వెంకటేష్‌ను కృష్ణాజిల్లా మచిలీపట్నం బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు.

17న అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

వై.రామవరం: మండల సరిహద్దు గ్రామమైన వెదురునగరంలోని శివసాయిభువనేశ్వరి ఆశ్రమంలో ఈనెల 17న రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు నిర్వాహకుడు సాయిరామ్ గురుస్వామి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 4 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9392128757 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయాలి

పాడేరు: మండలంలోని లగిసపల్లి పంచాయతీ కేజీబీవీ పాఠశాలకు ఆనుకొని ఉన్న సర్వే నెంబర్-47లో ప్రభుత్వ స్థలాన్ని గ్రామంలోని పేదలకు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ లకే పార్వతమ్మ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్వే నెంబర్-47లో ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని గతంలో పంచాయతీ తీర్మానంతో కొంత స్థలం కేజీబీవీ పాఠశాల నిర్మాణానికి అప్పగించగా, మిగిలి ఉన్న కొంత ఖాళీ స్థలాన్ని కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కారణంగా ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన ఇళ్లు లేని పేదలకు ఇవ్వాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి



సభలో నినాదాలు చేస్తున్న నాయకులు

రంపచోడవరం: అటవీ సంరక్షణ నిబంధనలు-2022, ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై దాడి చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా పిలుపునిచ్చారు. రంపచోడవరంలో గురువారం నిర్వహించిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ఏపీ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఆరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పీడిత ప్రజల గొంతుకగా ప్రజా ఉద్యమాలకు అండగా పనిచేస్తుందన్నారు.ప్రజాకళలు పీడిత ప్రజానీకం పక్షాన నిలుస్తుందన్నారు. రాష్ట్ర జనరల్ కౌన్సిల్ అరుణోదయ రాష్ట్ర నాయకులు వి.భీమశంకర్, ఐ బాలు, వి శాంతి, కూర్మారావు, ధర్మారెడ్డి అధ్యక్ష వర్గంగా వ్యవహించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. దేశవ్యాప్తంగా కళాకారులు, రచయితలు, మేధావులపై దాడులు నిలిపి వేయాలని, కేసులు రద్దు చేయాలన్నారు. భాషా , సంస్కృతులను పరిరక్షించాలి. రంపచోడవరం కేంద్రంగా అల్లూరి సీతారామరాజు మ్యూజియం ఏర్పాటు చేయాలన్నారు. అరుణోదయ నూతన కౌన్సిల్ ఎన్నిక జరిగింది.అలాగే అక్టోబర్ 6 నుంచి 28 రాజమహేంద్రవరంలో నిర్వహించే పీడీఎస్‌యూ గోల్డెన్ జూబ్లీ సభను విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల వాడ.. దొరగూడ

- రహదారి లేక అవస్థలు
- కాలినడకే శరణ్యం
- కానరాని మౌలిక సదుపాయాలు
- సమస్యలతో గ్రామస్తుల సావాసం
- పట్టించుకోని యంత్రాంగం



అడవి ప్రాంతం మీదుగా నిత్యావసర సరకులు మోసుకొని వెళ్తున్న గ్రామస్తులు



రోగిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు వాగు దాటిస్తున్న దొరగూడ గ్రామస్తులు(ఫైల్)

ముంచంగిపుట్టు: స్వతంత్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడుస్తున్నా ఆ గ్రామానికి నేటికి సరైన రహదారి లేదు. ఎక్కడికి వెళ్లాలన్నా గ్రామస్తులకు కాలినడకే శరణ్యం.. అత్యవసర పరిస్థితుల్లో డోలి మోతే దిక్కు... వారికి 108, 104 వంటి సేవలు కూడా అందని పరిస్థితి... నేటికి అభివృద్ధికి దూరంగా బతుకుతున్న గిరిజనులు.

కొండలు, గుట్టలు ఎక్కాల్సిందే

ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయితీ అత్యంత మారుమూల దొరగూడ గ్రామంలో గిరిజనులు సమస్యలతో సావాసం చేస్తున్నారు. 26 కుటుంబాలకు చెందిన 76 మంది గిరిజనులు నివసిస్తున్నారు. గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో రవాణా కష్టాలు పడుతున్నారు. దొరగూడ నుంచి లక్ష్మీపురం పంచాయతీ కేంద్రానికి చేరుకునేందుకు అయిదు కిలోమీటర్లు కాలినడకన కొండలు, గుట్టలు ఎక్కి అటవీ మార్గం మీదుగా సాహస ప్రయాణం చేయాలి. ముఖ్యంగా వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే రెండు వాగులు దాటితేనే పంచాయతీ కేంద్రానికి చేరుకోగలరు. ప్రతి నెల రేషన్ సరుకుల కోసం దొరగూడ గ్రామ గిరిజనులు బిరిగూడ గ్రామానికి ఏడు కిలో మీటర్లు రావాల్సిన పరిస్థితి నెలకొంది. తిరిగి రేషన్ సరుకులను మోసుకొని కాలినడకనే గ్రామానికి వెళ్లాల్సి వస్తుంది.అడవీ మార్గంలో అడవి జంతువుల భయం గ్రామస్తులను వెంటాడుతోంది. వర్షాలకు రహదారులు కోతకు గురై రాళ్లు తేలి.. పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారింది. గ్రామానికి అత్యవసర సేవలైన 108, 104 రాలేని పరిస్థితులు ఉన్నాయి. ఈ కారణంగా అత్యవసర సమయాల్లో రోగులను, గర్భిణులను ఆస్పత్రికి తరలించాలంటే డోలి మోతే వారికి దిక్కుగా మారింది. ముఖ్యంగా ఎప్పుడూ ఉధృతంగా ప్రవహించే ఉబ్బెంగుల వాగును అతికష్టం మీద దాటి ఆరోగ్య కేంద్రాలకు తరలించడం పరిపాటిగా మారింది. అంగన్‌వాడీ కేంద్రానికి రావాలంటే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అయిదు కిలోమీటర్లు దూరంలో ఉన్న ఉబ్బెంగుల గ్రామానికి రావాల్సిందే. పాఠశాలకు పక్కా భవనం లేక చెట్ల నీడలో, ఇంటి వరండాల్లో విద్యార్థుల చదువులు సాగుతున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వీధుల్లో మురుగునీరు నిలువ ఉండిపోతుంది. దీంతో పారిశుద్ధ్యం లోపించి, దోమల ఉధృతితో గిరిజనులు రోగాల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రావీటి ద్వారా సరఫరా అవుతున్న నీరు వర్షకాలంలో కలుషితం కావడం, ఎండకాలంలో తాగునీటి ఎద్దడితో గ్రామస్తులు పారుగెడ్డల కలుషిత నీటిని వినియోగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అన్ని సమస్యలతో బతుకులను ముందుకు సాగిస్తూ దొరగూడ గిరిజనులకు పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.



దొరగూడ గ్రామానికి వెళ్లే రహదారి పరిస్థితి



అభివృద్ధికి నోచుకొని దొరగూడ గ్రామం

ప్రాణాలకు తెగించి ప్రయాణం

సరైన రహదారి లేక అటవీ, కొండల మార్గంలోనే ప్రయాణం చేస్తున్నాం. నిత్యావసర సరకులను, రేషన్ బియ్యం తెచ్చుకునేందుకు ప్రతినెల చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాకాలం నాలుగు నెలలు గ్రామం నుంచి బయటకు వచ్చేందుకు సాహస ప్రయాణాలు చేయాలి. పాఠశాలకు భవనం లేదు. పిల్లలు చదువుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్య తీర్చాలి.

– లక్ష్మణ్, దొరగూడ గ్రామం, లక్ష్మీపురం పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

రహదారి నిర్మించాలి



మారుమూల దొరగూడ గిరిజనులు నేటికి దుర్భరమైన జీవితంతో కాలం గడుపుతున్నారు. సరైన రహదారి లేక రోగులను, గర్భిణులను అత్యవసర సమయాల్లో డోలి మోతతోనే కాలినడకన తీసుకువస్తున్నారు. పలు సమయాల్లో మార్గం మధ్యలోనే చాలామంది ప్రాణాలు కోల్పోయారు. దొరగూడ రహదారికి నిధులు మంజూరు చేయాలని అనేకసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. రహదారికి నిధులు మంజూరు చేస్తే వారి బతుకులు బాగుపడతాయి.

– కె.త్రినాథ్, సర్పంచ్, లక్ష్మీపురం, ముంచంగిపుట్టు మండలం

ప్రతిపాదనలు పంపాం

దొరగూడ గ్రామానికి రహదారి సమస్యపై గ్రామస్తులు, సర్పంచ్,ఎంపీటీసీలు మా దృష్టికి తీసుకురావడం జరిగింది. ఉబ్బెంగుల గ్రామం నుంచి దొరగూడ గ్రామం వరకు తారురోడ్డు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగింది. నిధులు మంజూరైతే పనులు మొదలుపెడతాం.

– రాములు, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ, ముంచంగిపుట్టు

రహదారి పనుల పరిశీలన



రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలులో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ, ఎంపీపీ బాకా ఈశ్వరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మ, ఎంపీపీ బాకా ఈశ్వరి మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైనా కూటమి ప్రభుత్వం పనులు చేయడంలో నిర్లక్ష్యం చూపుతోందన్నారు.

డంపింగ్ యార్డ్ ప్రారంభం



పర్రెడలో డంపింగ్ యార్డ్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ రవిశంకర్ తదితరులు

పెదబయలు: మండలంలోని పర్రెడ పంచాయతీ కేంద్రంలో డంపింగ్ యార్డును సర్పంచ్ చెండా రవిశంకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వాసులకు డంపింగ్ యార్డ్ అందుబాటులోకి రావడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త నుంచి సంపద తయారు చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ కుటుంబానికి రెండేసి డస్ట్‌బిన్లు పంపిణీ చేశామని, అందులోనే చెత్త వేయాలని, విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడానికి లేదన్నారు.పారిశుధ్యం మెరుగుకు అందరూ సహకరించాలని కోరారు. డీడీవో కె.సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శి లలిత కుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు



బండిగడ్డలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది



రేవళ్లులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఉమాదేవి



వంచులలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మధుసూదన్, సిబ్బంది



చెరకుంపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ రమేష్‌నాయుడు



తాంగులలో రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసబాబు

వై.రామవరం: మండలంలోని చామగడ్డ సచివాలయం పరిధిలోని బండిగడ్డ గ్రామంలో గురువారం వ్యవసాయశాఖ ఏఓ ఉషారాణి పర్యవేక్షణలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా భూమిలో ఉన్న పోషకాలను తెలుసుకోవచ్చన్నారు. పంట వేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం భూసార పరీక్షల పత్రాలను అందజేసి రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు, తెగుళ్ల నివారణకు కషాయాల తయారీ, వినియోగంపై శిక్షణ ఇచ్చారు. సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అనంతరం వరిక్షేత్రాలను సందర్శించి, వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం నీమాస్త్రం తయారీ విధానం, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ అసిస్టెంటు నవీన్, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని చీడిపాలెం, రేవళ్లులో మండల వ్యవసాయాధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీడిపాలెంలో కూడా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. పురుగు మందుల వినియోగంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ శాఖాధికారుల సలహాతో మందులు వాడాలన్నారు. పంటకు దోమ ఉధృతి ఉంటే ఇదాచి ప్రిడ్ 178 మందును 50 ఎం.ఎల్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సర్పంచ్‌లు సోమన్నదొర, వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని వంచుల గ్రామంలో ఏవో మధుసూదన్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో సాగుతో లాభాలు పొందవచ్చన్నారు. పంటకు తెగుళ్లు సోకితే తక్షణమే వ్యవసాయ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. సర్పంచ్ కాసులమ్మ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని కర్రిముఖిపుట్టు పంచాయతీ తాంగుల, కుమడ పంచాయతీ మూలపుట్టు గ్రామాల్లో ఏవో శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు లాభాలు వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని, మెలకువలు పాటించాలని కాఫీ, మిరియాలు తోటల పెంపకం లాభదాయమన్నారు. సర్పంచ్ పుల్‌మోత్తి, యూనిట్ ఇన్‌చార్జి రామారావు, వైఎస్సార్‌సీపీ నేత అర్జున్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో ఏవో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తమ పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వరి పంటకు సస్యరక్షణ చర్యలను వివరించారు. ప్రస్తుతం పంటకు సోకే తెగుళ్లు, ఆశిస్తున్న కీటకాల నివారణ చర్యలను వివరించారు. పంటలకు సోలార్ కంచె ఏర్పాటుపై అవగాహన కల్పించారు.

కొలువుదీరిన దుర్గమ్మ తల్లి



దూసరపాములో బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు



అడ్డతీగలలోని ప్రత్యేకాలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు

శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

పెదబయలు/హుకుంపేట/జి.మాడుగుల/సీలేరు: దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఎంతో సందడిగా ప్రారంభమయ్యాయి. ఒక పక్క భవానీ మాలధారణతో భక్తుల హడావిడి , మరో పక్క నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠలతో వాడవాడలా గ్రామాల్లో దసరా సందడి నెలకొంది. ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రసాద వితరణ జరిగింది. భారీ అన్నసమారాధన నిర్వహించారు. పలు చోట్ల బతుకమ్మ వేడుకల్లో భాగంగా బోనాల ఊరేగింపు సందడిగా జరిగింది. గిరిజన పల్లెల్లో దుర్గాభవాని స్మరణ మార్మోగింది. పెదబయలు మండల కేంద్రంలో ఏటా మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. భవానీ దీక్ష చేపట్టి, ప్రత్యేక పూజలు చేశారు. హుకుంపేటలోని జీసీసీ డిపో వద్ద దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నామని, రోజూ అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని భక్తులు తరలిరావాలని కమిటీ సభ్యులు కోరారు. జి.మాడుగులలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో భక్తులతో కలిసి ఎస్ఐ షణ్ముఖరావు తదితరులు పూజలు చేశారు. సీలేరులో కలశస్థాపన, అమ్మవారి నిజరూపదర్శనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జెన్‌కో అధికారులు, సీలేరు ఎస్ఐ రామకృష్ణ, సర్పంచ్ దుర్జో, భవానీ మాలధారులు పాల్గొన్నారు.



తోటపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

కనులపండువగా బోనాల ఉత్సవం

రంపచోడవరం/ఎటపాక/అడ్డతీగల/రాజవొమ్మంగి: రంపచోడవరంలో అల్లూరి సీతారామరాజు ఓనర్స్ అండ్ వర్కర్స్ మోటార్ యూనియన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా త్రిశక్తి దుర్గాపరదేవత ఆలయ ప్రాంగణంలో శరన్ననవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఎటపాక మండంలలోని మురుమూరు, తోటపల్లి,గుండాల, పురుషోత్తపట్నం గ్రామాల్లోని మండపాల్లో కనకదుర్గ అమ్మవారిని విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మొదటి రోజు మండపాల వద్ద బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తోటపల్లిలో సీఐ కన్నపరాజు ప్రత్యేక పూజలు చేశారు.అడ్డతీగలలోని దేవీ సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయంతో పాటు పవనగిరి క్షేత్రంలోని ఆలయంలో కలశ స్థాపన కార్యక్రమం జరిగింది. రాజవొమ్మంగిలో భవాని మాలధారులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. నూకాలమ్మ అమ్మవారి గుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దూసరపాము దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనం ఇచ్చారు. జడ్డంగి, శరభవరం, లాగరాయి, కొండపల్లి, కిర్రాబు, లబ్బర్తి, గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.





జి.మాడుగుల, రంపచోడవరం ప్రాంతాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో పూజలు చేస్తున్న భక్తులు



రాజవొమ్మంగిలో బోనాల ఊరేగింపులో భక్తులు

గ్రామ సభల్లో ప్రజా సమస్యలపై తీర్మానం



జి.మాడుగులలోని గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ రాంబాబు



జీకే వీధిలో మాట్లాడుతున్న సర్పంచ్ రామకృష్ణ

ముంచంగిపుట్టు/జి.మాడుగుల/ గూడెం కొత్తవీధి: ముంచంగిపుట్టు మండలంలోని 23 పంచాయతీ కేంద్రాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలను గురువారం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, రేషన్, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై గిరిజనులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చలు జరిపారు. శాఖల వారీగా జరుగుతున్న పనులపై అధికారులు వివరించారు. పలు పనులపై తీర్మానాలు చేశారు. సర్పంచులు రమేష్, నరసింగరావు, పార్వతమ్మ, పుల్‌మోత్తి, ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల మండల కేంద్రంతో పాటు సొలభంలో సర్పంచ్‌లు రాంబాబు, హనుమంతరావు, అధ్యక్షతన జరిగిన గ్రామసభల్లో గ్రామ వలంటీర్లను కొనసాగించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. డ్రైనేజీ సమస్యతో ఇతర సమస్యలపై తీర్మానం చేశారు. ఎంపీటీసీ సభ్యులు చిన్నారావు, విజయకుమారి, ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, వైస్ సర్పంచ్‌లు రాము, చిట్టిబాబు,నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు. గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లిలో సర్పంచ్ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో గ్రామాల్లో పనులకు ప్రభుత్వం నిధులను త్వరితగతిన విడుదల చేయాలని తీర్మానం చేశారు. గ్రామ సమస్యలు పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



ఎంపీడీవో కిరణ్‌కుమార్, క్లర్క్ వెంకట్‌రమణను సన్మానిస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్‌కు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రమణలకు కార్యాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఉపాధి హామీ ఏపీవో సంఘం నాయుడు, పీఆర్ ఏఈ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారికి శాలువాతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో చేసిన సేవల వీడియోను ప్రదర్శించారు. అనంతరం సన్మాన గ్రాహిత ఎంపీడీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లినట్టు ఆయన చెప్పారు.

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసి బదిలీపై వెళుతున్న ఎంపీడీవో లోహిత్ జయసాగర్‌ను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు.నాయకులు పెదబాలన్న, సత్యనారాయణ మన్మథరావు, బంగార్రాజు పాల్గొన్నారు.